# తొమ్మిదో హత్యా!!?

- దొగ్గా సాయి చంద్రశేఖర్

సాయంత్రం ఐదుగంటల నుండి అతనికోసం ఎదురు చూస్తోంది ధరిత్రి.

సరిగ్గా ఐదుగంటలకే వస్తానన్నాడు మరిప్పుడు తొమ్మిది గంటలైంది. దాదాపుగా బీచ్‌లో తను తప్ప మరెవరూ లేరుకూడా.

మెల్లమెల్లగా నల్లని మబ్బులు ఆకాశాన్ని అలుముకోవడం గమనించింది.

అంటే ఇక వర్షం కూడా వస్తుందన్నమాట. ఇంకా ఎదురుచూడడం అనవసరం వెంటనే వెళ్లిపోవాలని అనుకుంది. అల వెనుక అలను కదిలిస్తున్న సముద్రం వైపునుండి దృష్టి మరల్చి పడమటి దిక్కుగా చూసింది.

దూరంగా నల్లని ఆకారం జేబుల్లో చేతులు పెట్టుకుని వేగంగా ఇసుకలో అడుగులు వేస్తోంది. చందూలాగే అన్పిస్తున్నాడు. కానీ చందూ అలా నడవడం తానెప్పుడూ గమనించలేదు. చందూనా? కాదా? అని నిర్ణయించుకోలేకపోతోంది ధరిత్రి.

ఒకవేళ చందూ కాకపోతే? ఎలా? తాను ఒంటరిగా వుందే!

అతడేమైనా చేస్తే? ఏ విధంగా ప్రతిఘటించాలి?

తరచూ ఈమధ్య న్యూస్‌పేపర్‌లోని ఓ వార్త ఆడపిల్లల్ని కలవరపరుస్తోంది.

కోల్డ్‌బ్లడెడ్ కిల్లర్ గురించి చాలా వింతగా రాసారు.

అందమైన అమ్మాయిల్ని హత్య చేసి చనిపోయినవారి చేతివ్రాతతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు లేఖ వ్రాయించడం హంతకుని ప్రత్యేకత.

ఆ వచ్చేది హంతకుడే అయితే? ఏం చేయాలి?

ఎలా తప్పించుకోగలదు తను? ఒకవేళ పేపర్లోని వార్త ఖచ్చితంగా నిజమే అయితే! తన దగ్గరకు రాగానే చంపడు.

బెదిరించో, భయపెట్టో ముందు లెటర్ వ్రాస్తాడు.

ఆ తరువాత చంపడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు అతన్ని కన్విన్స్ చేసి తన ఫ్లాట్‌కి ఆహ్వానించాలి.

ఆ తరువాత ఏం చేయాలో అక్కడే చేయవచ్చు.

అతను వేస్తున్న అడుగులు లెక్క పెడుతోంది. అంచనా కూడా వేస్తోంది.

ఎన్ని అడుగులు వేస్తే తన దగ్గరకు చేరతాడా? అని.

అంతేకాదు అతను చందూనా కాదా? అన్నది ఎన్ని అడుగుల దూరంలో ఉండగా తాను తెలుసుకోగలదో కూడా ఆలోచించింది.

ఒకవేళ అతను చందూ కాకుంటే! ఎంత వేగంగా పరుగిడితే అతనికి దొరక్కుండా తప్పించుకోగలనా అని కూడా గ్రహించింది ధరిత్రి.

ఇంకా పదిహేను అడుగులు వేస్తే అతను ధరిత్రిని చేరతాడు.

సరిగ్గా అప్పుడు గుర్తించింది అతను చందూ కాదని.

మెరుపువేగంతో పరుగెత్తలేకపోయినా తాను అతివేగంగా మాత్రం పరుగెత్తగలదు. రన్నింగ్‌లో ఛాంపియన్ కూడా.

అదే బలంతో ధరిత్రి వేగంగా పరుగెత్తడం ప్రారంభించింది.

వెనక్కి తిరిగి చూడకుండా పరుగెడుతోంది.

అతను ఏదో చెబుతున్నట్లున్నాడు. అది స్పష్టంగా ఆమె చెవులను చేరడంలేదు.

"మిస్ ధరిత్రీ! ఎందుకలా పరుగెడుతున్నారు? ఏమయింది మీకు?'' అని అరుస్తూ అతను వెంబడించడం ప్రారంభించాడు.

అతనూ వేగంగానే పరుగెడుతున్నాడు. కొద్దిగా ఆమెకు దగ్గరలోకి వచ్చాడు.

అప్పుడు ధరిత్రికి అతని మాటలు వినిపించాయి.

"ధరిత్రీ! చందూ నన్ను పంపించాడు. నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి. ప్లీజ్ ఆగు''

తక్కున ఆగిపోయింది ధరిత్రి.

కొద్దిగా సిగ్గుపడింది కూడా. ఎన్నడూలేని భయం ఆవరించి తాను పారిపోవడం ఏమిటి? ఎంత పిరికితనం? అనుకుంటూ ఆగి...ఆగి వస్తున్న గాలికి పూర్తిగా ఆరిపోని స్వేదాన్ని తుడుచుకుంటూ అతన్ని పరీక్షగా చూసింది.

"ఎందుకండీ నన్ను చూసి పారిపోతున్నారు? నేనేమయినా రక్తపిశాచిలా కనిపిస్తున్నానా? మీరు అంత భయస్తులని చందూ చెప్పలేదే'' అన్నాడు అతను.

"సారీ! నిజం చెప్పాలంటే ఉదయం పేపర్‌లో చూసిన హంతకుడు మీరేనన్న భయంతో పరుగెత్తాను'' అంది ధరిత్రి కొద్దిగా ఆయాసపడుతూ.

"చాలా ముఖ్యమైన విషయం చెప్పాలి మీకు. సరిగ్గా నలభై నిముషాల క్రిందట చందూ ఫోన్ చేసి చెప్పాడు మీరు బీచ్‌లో ఎదురుచూస్తుంటారని, కలసి మీకా విషయం చెప్పమని'' అన్నాడు అగంతకుడు.

"ఓహ్...సారీ. చెప్పండి చందూ ఎందుకు రాలేకపోయాడు? అసలు దేని గురించి చెప్పాలని చందు ప్రయత్నం. సస్పెన్స్ భరించడం ఎంత కష్టమో తెలుసా? చెప్పండి'' అంది ధరిత్రి.

"వర్షం వచ్చేలా వుంది. సమయం కూడా చాలా అయింది. మనం ఇక్కడే నిలబడి మాట్లాడుకోవడం మంచిది కాదని నా ఉద్దేశ్యం'' అన్నాడు అగంతకుడు.

రెస్టారెంట్‌లో కూర్చుందాం పదండి'' అంది ధరిత్రి.

"మీరు కారు తీసుకువచ్చారా?'' అడిగాడు అగంతకుడు.

"కారు రిపేరు చేయించాలి. టైం లేదని

టాక్సీలో వచ్చాను. ఏం? ఎందుకు?'' అడిగింది ధరిత్రి.

అంతలో అనుకున్నట్లుగానే వర్షం ప్రారంభమయింది.

అప్పుడు చెప్పాడు అగంతకుడు "అతి ముఖ్యమైన విషయం ఇది. కొన్ని ఫొటోగ్రాఫ్స్ కూడా మీకు చూపించాలి. పబ్లిక్‌గా చేసే పని కాదని నా ఉద్దేశ్యం''

"అయితే ఏం చేద్దాం?'' అయోమయంగా చూస్తూ అడిగింది ధరిత్రి.

"మీ ఫ్లాట్‌కి వెళదాం. నేను వెళ్లి టాక్సీ తీసుకువస్తాను'' అన్నాడు అగంతకుడు.

"అసలు చందూ ఎప్పుడు నన్ను కలుస్తాడో చెప్పగలరా?'' అంది ధరిత్రి.

"అది చెప్పాలనే వచ్చాను. అక్కడే వుంది అసలు చిక్కు సమస్య'' అన్నాడు అగంతకుడు.

టాక్సీ పిలిచాడు అగంతకుడు.


ఇద్దరూ టాక్సీలో కూర్చున్నారు.

"ఫ్రెంచ్ కాలనీ'' చెప్పింది ధరిత్రి.

టాక్సీ నలభై నిముషాలు వేగంగా ప్రయాణించిన తరువాత ఫ్రెంచ్ కాలనీలోకి ప్రవేశించింది.







## అభిమానం

అందం, అభినయం విషయంలో బాలీవుడ్ తారలు తమ జూనియర్స్‌కి ఆదర్శంగా నిలుస్తుంటారు. 'మర్డర్' చిత్రం తర్వాత మల్లికా షెరావత్‌కి అభిమానుల సందడి బాగా పెరిగింది. ఆమె నటన ఎలా ఉన్నా అభిమానుల ఫోన్ కాల్స్ మాత్రం బాగా పెరుగుతున్నాయి. ఎంత పని ఉన్నా జనం మధ్యకి వెళ్లడం తనకి ఎంతో ఇష్టం అంటోందీ భామ. ఆమె ఇప్పుడు ఎక్కువగా పార్టీలకి అటెండ్ అవుతోంది. తన గురించి ఎవరు ఏమనుకుంటున్నారో తెలియడానికి ఇంతకన్నా మంచి మార్గం లేదు.

అప్పటివరకూ ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

టాక్సీ డ్రైవర్ వారి సంభాషణ వింటాడని కాబోలు.

టాక్సీ ఫేర్ చెల్లించి ఫ్లాట్‌వైపు అడుగులు వేస్తోంది ధరిత్రి.

ఆమె వెనుక కదిలాడు ఆగంతకుడు.

గేటు దగ్గర వాచ్‌మెన్ లేడు. భార్యకి పురిటినొప్పులని హాస్పిటల్‌కి వెళ్లాలని ఉదయం అనగా వెళ్లిపోయాడు.

తాళం తీసి లోపలకు అడుగుపెట్టి అతన్ని లోనికి ఆహ్వానించింది ధరిత్రి.

ఆగంతకుడు హాల్లో పరికించి చూస్తూ సోఫాలో కూర్చున్నాడు.

"ఒక్క నిముషం" అంటూ ధరిత్రి బాత్రూమ్ లోకి వెళ్లింది.

ఆగంతకుడు ఆమె వెళ్లినవైపే చూస్తూ ఒక్క నిముషం అన్నప్పుడు ఆమె పెదాల కదలికలోని వంపుని అందాన్ని మరోసారి కన్నుల్లోకి తెచ్చుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

అతని ఆలోచనలు కొన్ని గంటలు వెనక్కి వెళ్లాయి.

***

ఫ్లాట్‌ఫాం నెంబర్ ఏడు మీదకు వచ్చిన రైలు మరో పది నిముషాల్లో బయలుదేరబోతున్నదన్న అనౌన్స్‌మెంట్ వినిపించింది.

బోగి నెంబర్ తొమ్మిదిలో విండో ప్రక్కన కూర్చున్న చందు ఎదురుగా ఫ్లాట్‌ఫాం మీద నిలబడ్డ వ్యక్తితో చెబుతున్నాడు.

"సుధీర్! ధరిత్రి ఈ రోజు నాకోసం బీచ్‌లో ఎదురుచూస్తూ వుంటుంది. నేను అయిదు గంటలకే ఆమెను కలవాల్సి వుంది. కానీ అతి ముఖ్యమైన ఇన్‌ఫర్మేషన్ కోసం బొంబాయి వెడుతున్నాను. రాత్రి పదిగంటలవరకైనా నాకోసం అక్కడే ఎదురుచూస్తూ వుండిపోతుంది. అసలే హంతకుడు తిరుగుతున్నాడు..."

చందూ మాటలకు అడ్డొస్తూ "సెల్‌కి ఫోన్ చేసి ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పలేదా" అన్నాడు సుధీర్.

"సెల్, కారు ఒకేసారి రిపేరుకి వచ్చాయి. నువ్వు వెళ్లి కబురు చెప్పాల్సిందే. నాకోసం ఎదురుచూస్తూ అలా బీచ్ ఒడ్డున తెల్లవారేదాకా ఉండిపోగలదు కూడా. వెంటనే వెళ్లి ధరిత్రిని ఇంటికి చేర్చు" అన్నాడు చందు.

"పోలీసులు యాక్షన్ ప్రారంభించారు. నీ గురించి వేట ప్రారంభమయినట్లే. అన్నివైపుల నుండి ఒకేసారి చుట్టుముడతారు. రకరకాల వేషాల్లో సిఐడిలు నగరంలో తిరుగుతున్నారు. నువ్విక హత్యలు ఆపి బొంబాయి వచ్చేయ్" అన్న ఫోన్‌కాల్ రిసీవ్ చేసుకున్న నటోరియస్ కిల్లర్ అబ్దుల్ గఫార్ ఇప్పుడు బొంబాయి బయలుదేరే రైల్లో వున్నాడు.

అప్పర్ బెర్త్‌మీద చేరబడితను ఎంతమంది అమ్మాయిల్ని ఎలా చంపింది మననం చేసుకుంటున్నాడు.

చందూ మాటలు అతని చెవిని సోకాయి.

బొంబాయి వెళ్ళే ముందు ఒక్క మర్డర్...చేస్తే ఖచ్చితంగా తొమ్మిది హత్యలు పూర్తవుతాయి. అది అతనికి కలిసొచ్చిన అదృష్టపు సంఖ్య. ఖచ్చితంగా తొమ్మిది హత్యలుచేస్తేగానీ ఆ వూరిని వదిలిపెట్టడు.

ఠక్కున బెర్త్ దిగాడు. బ్యాగ్ భుజానికి తగిలించుకున్నాడు.

ట్రైన్ వేగం పుంజుకోబోతుండగా ఫ్లాట్‌ఫాం మీద కాలు మోపాడు.

చందూతో మాట్లాడిన వ్యక్తిని వెంబడించడం ప్రారంభించాడు.

సుధీర్ ఫ్లాట్‌ఫాం టిక్కెట్‌ను ఎంట్రన్స్‌లోని టిక్కెట్ కలెక్టర్‌కు అందించి బయటకు వచ్చి స్కూటర్ స్టాండ్‌లోని వెహికిల్‌ని తీసాడు.

"టిక్కెట్ ప్లీజ్" అంటున్న టీసీ చేతిలో తను వెళ్లవలసిన బొంబాయి రిజర్వేషన్ టిక్కెట్‌ను ఉంచిన గఫార్ వేగంగా కదిలి సుధీర్‌ను కలుసుకున్నాడు.

"నమస్తే సుధీర్ భాయ్!" అన్న పిలుపు విని పించి వెనక్కి తిరిగాడు సుధీర్.

ఎదురుగా అతనికి తెలియని వ్యక్తి నవ్వుతూ కన్పించాడు.

"ఎవరు మీరు?" అన్నట్లు చూసాడు సుధీర్.

"ప్లీజ్! మీరు ఎక్కడికి వెడుతున్నారు? కొద్దిగా లిఫ్ట్ ఇస్తారని..." అన్నాడు గఫార్.

"ఎవరు మీరు? నా పేరు మీకెలా తెలుసు?" అడిగాడు సుధీర్.

"ఓహ్ సారీ... చందూ మీకు ఎలా ఫ్రెండో మీరు నాకు అలాగే" అన్నాడు గఫార్.

"చెప్పండి ఎక్కడికెళ్లాలి?" అన్నాడు సుధీర్.

చెప్పలేదు సుధీర్.

చేతిలోని కర్చీఫ్‌ని సుధీర్ ముక్కు దగ్గర వుంచాడు.

అంతే...



మరుక్షణమే నేలమీదకు జారిపోయిన సుధీర్‌ని రెండు చేతులతో ఎత్తుకుని స్కూటర్ స్టాండ్ తాలూకు ఆఫీసు రూమ్‌లోకి తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టి అక్కడ క్లర్క్‌కి చెప్పాడు "ఇతను నా ఫ్రెండ్. ఒక దుర్వార్త విని స్పృహ కోల్పోయాడు. నేను వెళ్లి డాక్టర్‌ని తీసుకువచ్చేదాకా చూస్తూ వుండండి" అని సుధీర్ వెహికిల్ మీద బీచ్‌కు బయలుదేరాడు అబ్దుల్ గఫార్.

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ-

"మిస్టర్! నీ పేరు చెప్పనేలేదు" అంది ధరిత్రి చేతిలోని ఆపిల్ జ్యూస్ గ్లాస్‌ని టీపాయ్ మీద పెడుతూ.

"నా పేరు గఫార్...అబ్దుల్ గఫార్. కూర్చోండి మీరు కూడా" అంటూ సోఫాలో ప్రక్కకు జరిగాడు.

"ముందు చందూ విషయం చెప్పండి. ఏం చెప్పమన్నాడు. ఆ ఫొటోగ్రాఫ్స్ ఏమిటి?" అడిగింది ధరిత్రి.

"చెబుతా...చెబుతా...కొద్దిగా తలనొప్పి అన్పిస్తోంది. కాస్త కాఫీ ఇస్తారా?" అన్నాడు గఫార్.

"ఓ...సారీ...ఏం కావాలని అడగలేదు కదూ. జ్యూస్ త్రాగుతారని అనుకున్నా. ఒక్క నిముషంలో కాఫీ చేస్తాను" అంటూ కిచెన్‌లోకి వెళ్లింది ధరిత్రి.

బ్యాగ్‌లోనుండి తెల్ల కాగితాల కట్ట బయటకు తీసి టీపాయ్ మీద వుంచాడు.

ఏ ట్రిక్ ప్రయోగిస్తే ఆమెతో సంతకం చేయించవచ్చో అప్పటికే అతని బ్రెయిన్‌లో రూపుదిద్దుకుంది.

ఆమె చేతి వ్రాతను జస్ట్ చూస్తే చాలు ఖచ్చితంగా అలాగే వ్రాయగలుగుతాడు అబ్దుల్ గఫార్.

ధరిత్రి కాఫీ కప్పుతో వచ్చింది.

"ఏమిటీ తెల్ల కాగితాలు? మీరు రచయితా?" అడిగింది.

కాఫీ కప్పు అందుకుని "కుడి చేతి వేళ్ళు పని చేయడంలేదు. ఒక్క అత్యవసరమైన అడ్రస్ ఇందాకటినుండి మననం చేసుకోలేక ఛస్తున్నా. కొద్దిగా వ్రాసి పెట్టరూ" అన్నాడు గఫార్.

"చెప్పండి" అంది ధరిత్రి పెన్ చేతిలో పట్టుకుని.

గఫార్ కాఫీ సిప్ చేస్తూ ఆమె పెదవులవైపు చూస్తూ "నరకయాతన" అన్నాడు.

"వ్వాట్" అదిరిపడిందామె.

"సారీ...సారీ...అడ్రస్ మరచిపోయినట్టున్నాను" అన్నాడు కాఫీ సిప్ చేస్తూ.

అప్పటికే అతని ఎడం చేతిలో కర్చీఫ్ సిద్ధంగా వుంది ధరిత్రిని స్పృహ తప్పించడానికన్నట్లు.

ధరిత్రి అయోమయంగా అతన్ని చూస్తూ "చెప్పండి" అంది.

"చందూకి..." అన్నాడు.

"వ్వాట్" అంది ధరిత్రి.

"ప్లీజ్ వ్రాయండి..." అన్నాడు గఫార్.

వ్రాసింది. "చెప్పండి" అంది అతని కళ్లల్లోకి చూస్తూ.

ఇప్పుడు గఫార్ కళ్లల్లో కొద్దిగా మత్తునికూడా చూస్తోంది.

చెప్పాడు గఫార్ "నేను ధరిత్రిని చంపబోతున్నాను. చందూకి నరకయాతన" అని.

"ఏమిటీ పిచ్చివాగుడు? ఎవరు నువ్వు?" అంది కొద్దిగా వెనక్కు జరుగుతూ.

"నటోరియస్ కిల్లర్ అబ్దుల్ గఫార్‌ని నేనే. నిన్ను చంపితే తొమ్మిదిమంది పూర్తవుతారు. అప్పుడు బొంబాయి వెళ్లిపోతాను" అతని కళ్లల్లో ఇంకొద్దిగా మత్తు.

"ఎలా చంపుతావు? నేను వేగంగా పరుగెత్తగలను. బీచ్‌లో చూసావుగా" అంది ధరిత్రి కొద్దిగా వెనక్కు జరుగుతూ.

తక్కున లేచి కర్చీఫ్‌ని ధరిత్రి ముఖం మీద ఉంచడానికి ప్రయత్నించాడు.

కానీ అలా జరగలేదు. సోఫాలో కుప్పకూలిపోయాడు ఎనిమిదిమందిని అడ్డంగా నరికేసిన నటోరియస్ కిల్లర్ అబ్దుల్ గఫార్.

అంతలో తలుపుతట్టిన శబ్దంతోపాటు కాలింగ్ బెల్ మోత వినిపించింది.

తక్కున తలుపు తెరిచింది ధరిత్రి.

ఎదురుగా చందూతోపాటు నగరంలోని పోలీసులు.

"వ్వావ్! అద్భుతం ధరిత్రి. అతనికి అనుమానం రాకుండా స్పృహ తప్పించావ్" అన్నాడు చందూ.

"అసలు కిల్లర్ బొంబాయి వెళ్లిపోబోతున్నాడన్న ఫోన్ కాల్ టాప్ చేసి అనుమానం వచ్చిన ప్రతి బోగీలో 'సుధీర్... ఒంటరి ధరిత్రిని బీచ్‌లో కలవాలి' అని చెప్పిన ప్లాన్ అద్భుతం" అంది ధరిత్రి.

ఇంటిలిజెన్స్ విభాగంలో సరిగ్గా వారం రోజుల క్రిందట డ్యూటీలో జాయిన్ అయిన చందూకి కాబోయే శ్రీమతి ధరిత్రి. ఇనస్పెక్టర్ ధరిత్రి!

సాహసాలు చేయడం అంటే వారిద్దరికీ కాలేజీలో చదివేటప్పటి నుంచీ అలవాటే. మరింత ఇష్టం కూడా. అందుకే అలాంటి ఉద్యోగాలు ఎంచుకున్నారు.

★

## భయం

రచయితల సభ జరుగుతోంది.

ముకుందరావు అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ప్రేక్షకులకి సహనం చచ్చిపోయింది. తోటి రచయితలు విసుగ్గా ముఖం పెట్టారు. విలేకరులు అప్పటికే జారుకున్నారు. కార్యకర్తల్లో ఒకడు ముకుందరావు చెవిలో ఏదో ఊదాడు. ఉపన్యాసం ముగిసింది.

ఆ కార్యకర్తని చాటుకి పిలిచి అడిగారు జనం "ఏం చెప్పావని?"

"సభకి మీ ఆవిడ వస్తున్నట్లుగా ఫోన్ వచ్చింది అని అన్నానంతే!"

**-పసుపులేటి సాయిలక్ష్మి** (నెల్లూరు)

## అరెస్ట్

"ఈ వ్యక్తిని ఎందుకు అరెస్టు చేసావు?" కానిస్టేబుల్‌ని అడిగాడు ఎస్ఐ.

"ఇతడు వైట్ షర్ట్ వేసుకున్నాడు సార్" అన్నాడు కానిస్టేబుల్.

"అయితే అరెస్టు చేస్తావా?"

"అది కాదు సార్. ఇతడికి వైట్ కాలర్ నేరాలతో సంబంధాలు వున్నాయేమోనన్న అనుమానంతో అరెస్టు చేసాను"

## ఆశయం

"సార్! రాజకీయ నాయకునిగా మీ ఆశయం ఏమిటి?" ప్రశ్నించాడు విలేకరి.

"ఈ పార్టీ నుంచి ఆ పార్టీ, ఆ పార్టీ నుంచి ఈ పార్టీ... అలా అన్ని పార్టీలలో చేరి గిన్నీస్ బుక్‌లో రికార్డు సాధించాలని వుంది" చెప్పాడు ఆ రాజకీయ నాయకుడు.

**-షేక్ అస్లాం షరీఫ్** (శాంతినగర్)

